ప్రజాశక్తి
గురువారం 8 జూన్ 2023
8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

వీడని అస్పష్టత.. గందరగోళం

- వెబ్ ఆప్షన్‌లో ఎడిట్‌కు లేని అవకాశం
- డిఇఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల అవస్థలు
- బదిలీ స్థానంలో చూపించని ఖాళీలు
- సబ్జెక్టు టీచర్‌లేక నష్టపోనున్న విద్యార్థులు
- ఎస్‌జిటిలకు నేటితో ముగియనున్న ఆప్షన్ గడువు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీ పోస్టులన్నీ చూపించకపోవడం, వెబ్ ఆప్షన్‌లో దొర్లిన పొరపాట్లను సరిచేసుకొనే అవకాశంలేకపోవడంతో ఉపాధ్యాయుల్లో ఏర్పడిన అస్పష్టత, గందరగోళమింకా కొనసాగుతోంది. విద్యాశాఖ ఇవేమీ పట్టించుకోకుండా పాఠశాలల పున:ప్రారంభం నాటికి బదిలీ ప్రక్రియ ముగించాలని చూస్తోంది. పొరపాట్లను సరిదిద్దాలని, జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి ఉపాధ్యాయులు వినతిపత్రాలు తీసుకొస్తున్నా, తమ చేతిలో ఏమీలేదని విద్యాశాఖాధికారులు చేతులెత్తేస్తున్నారు. పూర్తిస్థాయి ఖాళీలు చూపించకపోవడాన్ని నిరసిస్తూ ఫిజికల్ డైరెక్టర్లు బుధవారం మధ్యాహ్నం వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వలేదు. బదిలీకానున్న టీచర్ పోస్టు స్థానంలో వేరొక టీచర్ వచ్చేందుకు ఆ స్థానాన్ని ఖాళీ చూపించాల్సివుంది. ఖాళీ పోస్టు చూపించకపోవడంతో ఈ విద్యా సంవత్సరంలో సబ్జెక్టు టీచర్ లేని సమస్యను విద్యార్థులు ఎదుర్కోనున్నారు. బదిలీ ప్రక్రియలో జరిగిన పొరపాట్లను సరిచేయాలంటూ సెలవులు కావడంతో కోర్టులకు వెళ్లే అవకాశంకూడా ఉపాధ్యాయులకు లేకుండాపోయింది. ఎస్‌జిటిలకు వెబ్ ఆప్షన్ పెట్టుకొనే గడువు గురువారంతో ముగిశాక, శుక్ర, శనివారాల్లో హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లకు, ఆదివారం ఎస్‌జిటిలకు బదిలీ ఆర్డర్లు జనరేట్ కానున్నాయి. దీని ప్రకారం పాఠశాలలు పున:ప్రారంభంకానున్న 12న బదిలీ అయిన పాఠశాలలకు ఉపాధ్యాయులు వెళ్లాల్సివుంది.

పెదగంట్యాడ మండలం, గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయునిగా జి.రమాదేవి పనిచేస్తున్నారు. రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు బదులు పొరపాటున కంపల్సరీ ట్రాన్స్‌ఫర్ అని వెబ్ అప్షన్‌లో చూపిస్తోంది. రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌గా వెబ్ అప్షన్‌లో ఎడిట్ చేసుకొనే అవకాశం ఇవ్వలేదు.

పాయకరావుపేట మండలం, పాల్తేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్ లేకపోవడంతో గొడిచర్ల హిందీ ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్ నియమించారు. డిప్యుటేషన్ కాలపరిమితి ఏప్రిల్ 30తో ముగిసింది. కానీ 350 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలకు వెబ్ ఆప్షన్‌లో హిందీ టీచర్ పోస్టు ఖాళీ చూపించలేదు. హిందీ బోధించే టీచర్‌ను నియమించే అవకాశంలేక విద్యార్థులు నష్టపోనున్నారు. ఇదే మండలంలోని 464 మంది విద్యార్థులున్న ఎస్.నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయలాజికల్ సైన్సు పోస్టులు రెండు, ఇంగ్లీష్ పోస్టులు రెండింటికి ఒక్కో పోస్టు ఆప్షన్‌లో చూపించి, రెండు పోస్టులు బ్లాక్ చేశారు.

ఆనందపురం మండలం ఎర్రవానిపాలెం ఎంపిపి పాఠశాలలో ఆగస్టు 31 నాటికి 22 మంది పిల్లలున్నారు. ఇక్కడ ఒక రెగ్యులర్ టీచర్, మినిమం టైమ్ స్కేల్ (ఎంటిఎస్) టీచర్

మిగతా 2లో..

ఈదురు గాలులతో వర్షం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. చెట్లు కరెంటు తీగలపై పడడంతో రాత్రి 11 గంటలైనా కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా కాలేదు. పిటి జంక్షన్‌లో పెద్ద చెట్లు రోడ్డుపై పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. హోర్డింగ్‌లు గాల్లో ఎగరడంతో ప్రజలు భయాందోళన చెందారు. వర్షం ఒక మోస్తారుగా పడినప్పటికీ బలమైన గాలులు వీయడంతో చెట్లు విరిగిపడ్డాయి. చిన్న గుడిసెలు, రేకులు ఎగిరిపడ్డాయి. బొజ్జన్నకొండ ఏరియాలో ఇంటి మీద రేకు ఎగిరిపోయిందని మహిళ అమ్మాజీ ఆవేదన వ్యక్తంచేశారు. వర్షం తగ్గిన తర్వాత జివిఎంసి, ఎపి

మిగతా 2లో..

రోడ్లపై విరిగిపడిన చెట్లు

తేజ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ సృష్టికర్తకు గీతం డాక్టరేట్, వాణిశ్రీకి డిలిట్

వార్త 4లో..

క్రీడల్లో విశాఖకు గుర్తింపు తేవాలి

వార్త 2లో..

వార్త మెయిన్‌లో..

కెవి.రమణమూర్తి అంత్యక్రియల్లో పాల్గొన్న ఎల్ఐసి ఉద్యోగులు, యూనియన్, ప్రజాసంఘాల నాయకులు, ఇన్‌సెట్‌లో రమణమూర్తి (ఫైల్)

ఎల్ఐసి ఉద్యోగుల ఉద్యమ నేత కెవి.రమణమూర్తి మృతి

మొదటి పేజీ తరువాయి..

వీడని అస్పష్టత... గందరగోళం

పనిచేస్తున్నారు. వెబ్ ఆప్షన్‌లో మూడో టీచర్ పోస్టు ఖాళీ ఉన్నట్లు చూపించారు.

అనకాపల్లి జిల్లాలో సిహెచ్‌ఎన్ అగ్రహారం ఉన్నత పాఠశాలల్లో ఎనిమిదేళ్లు పూర్తిచేసుకున్న ఎన్ఎస్ టీచర్‌ను తప్పనిసరి బదిలీల్లో పెట్టారు. వెబ్ ఆప్షన్‌లో మాత్రం ఆ పోస్టు చూపించడలేదు. దీంతో ఈ ఏడాది ఎన్ఎస్ బోధించే టీచర్‌ను నియమించే అవకాశంలేక విద్యార్థులకు నష్టం వాటిల్లనుంది.

ఈదురు గాలులతో వర్షం

ట్రాన్స్‌కో అధికారులు చెట్లను తొలగిస్తున్నారు. పెదగంట్యాడ మండలం హెచ్‌బి.కాలనీ, నడుపూరు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మిగతా ప్రాంతాల్లో చెట్లు తొలగించే పనులు చేస్తున్నారు.

797వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : స్టీల్‌ప్లాంట్ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 797వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సిఐటియు ఆరిలోవ జోన్ అధ్యక్షుడు వి.నరేంద్ర కుమార్, ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు, గోపి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిలో క్రెడాయ్ కీలక పాత్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జిడిపిలో రియల్ ఎస్టేట్ రంగం వాటా 7 శాతంగా ఉందని, అది10 శాతానికి పెరిగే అవకాశం ఉందని ఆదాయపు పన్ను శాఖ విజయవాడ కమిషనర్ సాకా నరేష్ అన్నారు. క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నం దేశంలో 9వ ధనిక నగరంగా ఉందని, ఇది చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. రియల్ ఎస్టేట్ రంగం సామాన్యులకు ఇల్లు ఉండాలనే కలను సాకారం చేయడంలో సహాయపడుతోందని తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగం నుంచి టిడిఎస్ సహకారం పెరిగిందన్నారు. క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ ప్రెసిడెంట్ వి.ధర్మేందర్ మాట్లాడుతూ, సాధారణంగా ప్రజలు పన్ను చెల్లింపులపై ఇబ్బందులు పడుతుంటారని, బిల్డర్లు బలంగా ఉండటం వల్ల వైజాగ్ చాప్టర్ సభ్యులు టిడిఎస్ నిబంధనలను తెలుసుకోవడానికి, వాటిని పాటించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఏలూరు ఐటిఓ ఇంతియాజ్ టిడిఎస్‌పై పలు అంశాలను వివరించారు. డిపార్ట్‌మెంట్ సీనియర్ అధికారులు శంకర్ పాండి, జాయింట్ కమిషనర్, వై.విష్ణువర్ధన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ వి.నాగసూర్యారావు, ఐటిఓలు ఎన్.రేణుకాదేవి, టివిఆర్.రెడ్డి పాల్గొన్నారు. క్రెడాయ్ కార్యదర్శి వి.శ్రీను, శ్రీధర్, శరత్ బాబు, గత చైర్మన్ బయన శ్రీనివాసరావు, జాతీయ జాయింట్ సెక్రటరీ బి.రాజాశ్రీనివాస్ సందేహాలను అధికారులు నివృత్తిచేశారు.

జిఓ 21 రద్దు చేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఆటో కార్మికులకు నష్టం కలిగించే జిఓ 21ను రద్దుచేయాలని విశాఖపట్నం జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఎఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె రెహమాన్ డిమాండ్‌చేశారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ నెల 9, 10 తేదీలలో సంఘం జిల్లా 4వ మహాసభలు టిఎల్‌ఎన్ సభా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాల ఫలితంగా ఆటో కార్మికుల పరిస్థితి దినదిన గండంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు, థర్డ్ పార్టీ ఇన్స్యూరెన్స్, ఎల్‌ఎల్‌ఆర్, లైసెన్స్, పర్మిట్ చార్జీలు, స్పేర్ పార్ట్స్ ధరల పెరుగుదలతో నెలవారి ఇఎంఐలు కట్టుకోలేకపోతున్నారని తెలిపారు. నిత్యావసర ధరల పెరుగుదల, ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, కుటుంబానికి వైద్యం కూడా సక్రమంగా అందించలేక ఆటో డ్రైవర్లు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. దీనికి తోడు ట్రాఫిక్ పోలీసులు, ఆర్‌టిఎ అధికారులు విపరీతంగా జరిమానాలు విధిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిఓ 21 వల్ల రోడ్డుపై ప్రమాదం జరిగి అవతలి వ్యక్తి చనిపోతే నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారన్నారు. పర్మిట్ రెన్యువల్ లేకపోతే రూ.2 వేలు ఉన్న ఫైన్‌ను రూ.10 వేలకు, ఇన్స్యూరెన్స్ లేకపోతే రూ. వెయ్యి ఉన్న ఫైన్ రూ.2 వేలకు, లైసెన్స్ రెన్యువల్ కాకపోతే రూ.500 ఉన్న ఫైన్‌ను రూ.5 వేలకు పెంచి వసూలు చేస్తున్నారన్నారు. వాహన మిత్ర అంటూ రాష్ట్ర ప్రభుత్వం డ్రైవర్లకు సంవత్సరానికి రూ.10వేలు ఇస్తూ వేర్వేరు మార్గాల ద్వారా రూ.30వేలు గుంజుతోందని విమర్శించారు. ఈ సమావేశంలో ఎఐటియుసి అదనపు కార్యదర్శి ఎం.మన్మధరావు, సంఘం అధ్యక్షులు సిఎం.రమణ, ఉపాధ్యక్షులు సిహెచ్.కాసుబాబు, కార్యదర్శి సింహాద్రి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో విశాఖకు గుర్తింపు తేవాలి

మేయర్ హరి వెంకటకుమారి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : క్రీడలలో విశాఖ విద్యార్థులు నగరానికి మరింత పేరు తీసుకురావాలని, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయంగా పతకాలు తేవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కోరారు. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జివిఎంసి 98 వార్డులలో 363 శిక్షణా కేంద్రాలు నిర్వహించామని, సుమారు 10వేల మంది పిల్లలు వివిధ అంశాలలో శిక్షణ పొందారని తెలిపారు. చదువుతో పాటు క్రీడలలోనూ పిల్లలు రాణించాలనే సదుద్దేశంతో ఈ సమ్మర్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలూ లభిస్తాయన్నారు. త్వరలో మరిన్ని స్టేడియాల నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ మాట్లాడుతూ, ఆహ్లాదంతో పాటు శారీరక దృఢత్వాన్ని కలిగించే క్రీడలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మ మాట్లాడుతూ, పిల్లలు తమకు నచ్చిన క్రీడాంశాలలో ప్రావీణ్యం పొందాలన్నారు. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని మార్చ్ ఫాస్ట్ చేశారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, పతకాలను అతిథులు అందించారు. ఈ సందర్భంగా పిల్లలు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు తమ సందేశాలను ఇచ్చారు.

వేసవి శిబిరాల ముగింపులో క్రీడాకారుల గౌరవవందనం స్వీకరిస్తున్న అధికారులు

రైలు ప్రమాద బాధితుల క్లెయిముల పరిష్కారంలో సడలింపులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఒడిశా రైలు ప్రమాద బాధితుల క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియను ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్స్యూరెన్స్ సడలించిందని ఆ సంస్థ కస్టమర్ సర్వీస్, ఆపరేషన్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అమిష్ బ్యాంకర్ తెలిపారు. బుధవారం నగరంలోని హోటల్లో జరిగిన సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం విచారకరమని, ఈ సమయంలో వారి అవసరాలకు మద్దతుగా ఉండటానికి తాము క్లెయిముల పరిష్కార ప్రక్రియను సడలించామని చెప్పారు. దీని ప్రకారం నామినీ మూడు ప్రాథమిక పత్రాలను మాత్రమే సమర్పించాలన్నారు. బ్యాంక్ ఖాతా వివరాలు, మునిసిపల్ అధికారుల నుంచి మరణ ధ్రువీకరణ పత్రం అది లేకుంటే ఆసుపత్రులు, ప్రభుత్వ అధికారులు లేదా పోలీసులు జారీ చేసిన మరణించిన ప్రయాణికుల జాబితా, నామినీ చెల్లుబాటు అయ్యే చిరునామా రుజువు కాపీతో తమను సంప్రదించాలని కోరారు. ఈ విషాదం వల్ల ప్రభావితమైన కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం అందించడానికి క్లెయిమ్ పరిష్కారాన్ని వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు.

సముద్రాలను కాపాడుకుందాం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రాణవాయువును అధికంగా ఇచ్చే సముద్రాలను కాపాడుకుందాం అని కృష్ణా విశ్వవిద్యాలయం విశ్రాంత ఉప కులపతి సుంకరి రామకృష్ణారావు కోరారు. ఆంధ్ర యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ సముద్రాల పరిరక్షణ దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2050 నాటికి చేపల కన్నా, ఇతర జీవరాశి కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలే అధికంగా ఉంటాయని ఒక సర్వేలో తేలిందన్నారు. సముద్రాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మానవాళిదేనన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ సైన్స్ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపల్ డిఇ.బాబు, ప్రొఫెసర్ బాల ప్రసాద్, ప్రొఫెసర్ ఇయుబి.రెడ్డి, హరినాథ్, జానకిరావు, సిఫా సంస్థ ప్రతినిధి డాక్టర్ శశిప్రభ, గ్రీన్ క్లైమేట్ టీం ప్రతినిధి జెవి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

అనకాపల్లి జిల్లాలో మొదటి దశ రీ సర్వే పూర్తయిన 143 గ్రామాల రికార్డులు ఎ3/ఎ4 సైజులలో రీడబుల్ స్కానింగ్ చేయుటకు తే.07-06-2023 దిన వేసిన టెండర్లలలో రేట్లు ఎక్కువగా ఉండుట వలన తిరిగి అర్హత కలిగిన అభ్యర్థుల నుండి తేది 13-06-23 మధ్యాహ్నం2 గంటలలోపు శ్రీ జిల్లా కలెక్టరు అనకాపల్లి వారి కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి వారి ఛాంబరు నందు గల బాక్సులో సీల్డు టెండరు కవర్స్ వేయవలసినదిగా కోరడమైనది. సం/- **జిల్లా కలెక్టర్,** అనకాపల్లి

ఘనంగా మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర పోటీలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : న్యూహోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మంచ నాగమల్లీశ్వరి నేతృత్వంలో డాబాగార్డెన్స్ లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర - 2023 పోటీల ఫైనల్స్ నిర్వహించారు. 10 మంది మహిళలను విజేతలుగా ఎంపిక చేశారు. ఈ పోటీల్లో మిస్సెస్ విశాఖ టైటిల్‌ను ఉషాఉదయ్, మిస్సెస్ ఉత్తరాంధ్ర టైటిల్‌ను వెంపటి సరళ, మిస్ ఉత్తరాంధ్ర టైటిల్‌ను శ్రేయ వనమాలి కైవసం చేసుకున్నారు. మిస్సెస్ ఉత్తరాంధ్ర రన్నర్‌గా కోశెట్టి రాజ్యలక్ష్మి, మిస్ ఉత్తరాంధ్ర రన్నర్‌గా నిహారిక నిలిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ తోట నగేష్ మాట్లాడుతూ, మహిళలను చైతన్యపరిచే విధంగా నాగమల్లీశ్వరి ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నాగమల్లీశ్వరి మాట్లాడుతూ, అందరి సహకారంతో ఈ పోటీలు విజయవంతమయ్యాయన్నారు. చేనేత కళాకారుల సహాయార్థం చేపట్టిన ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాజబాబు, అప్పారావు, ఎస్‌కె.ఇన్ఫ్రా చైర్మన్ అంబల్ల సురేష్, వి.డెంటల్ డైరెక్టర్ రమేష్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ నాగసుధాలక్ష్మి, న్యూహోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మిస్సెస్ విశాఖ టైటిల్ విజేత ఉషాఉదయ్‌కు కిరీట ప్రదానం

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT : NARSIPATNAM
E.A.NO: /2023, E.P.NO: 43/2019, in 0.S.NO: 36/2009.

BETWEEN :
1.Chitikela Venkata Rama Chandra Rao
2.Mookala Rama Krishna (DIED ON : 19-03-2022) & 3 others
... PETITIONERS - D.Hrs.

AND :
1.Singampalli Appalanaidu
2.Singampalli Krishna Veni
...RESPONDENTS - J.Drs

NOTICE

1. Chitikela Venkata Rama chandra Rao, s/o.Late Appala Patrudu Hindu, Aged:57 years, Cultivation, and Business, resident of Giduthuru Village, Makavarapalem Mandal, Anakapalli District.
2. Mookala Rama Krishna, S/o.Late Swamy Naidu (DIED ON: 19-03-2022)
3. Mookala satyavathi, W/o.Late Mookala Rama Krishna Hindu, Aged:49 years, House wife, resident of Mallavaram Village, in Makavara Palem Mandal.Anakapalli District,
4. Mookala Satyanarayana Swamy, S/o.Late Mookala Rama Krishna Hindu, Aged:19 years, Minor, Rest.Do.
5. Mookala Tarun, S/o.Late Mookala Rama Krishna, Hindu, Aged:17 years. - Minor Rest. Do. (Petitioners/D.Hrs.3 to 5 are the class-I Legal Heirs of Deceased 2nd D.Hr.i.e. Mookala Rama Krishna) (Petitioner/D.Hr. 5 is being Minor-Represented by its Natural Guardian - Mother i.e. 3rd D.Hr. & i.e. Mookala Satyavathi..
PETITIONERS D.Hrs.
1.Singampalli Appala Naodu, Hindu, Aged:55 years,, s/o.Late Kannabbai, Iron & General Business, resident of Ballighattam Village, Narsipatnam Mandal, Anakapalli District.
2.Singampalli Krishna Veni, Wo. Appalanaidu, Aged: 49 years...**Rest.Do.**
... RESPONDENTS - J.Drs.

Please take Notice that the above matter stands posted on **13-06-2023** at 10.30 am for their Appearance. Therefore you are hereby advise to appear before the Honourable court either in person or through your Advocate, railing which the matter will be Decided in your absence.

Sri R.D.V.G.V Prasad
ADVOCATE for D.Hrs.Petitioners
24th Ward, Velama Street,
NARSIPATNAM.
Cell : 80747 06152

NARSIPATNAM
Dated:8-06-2023

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
E.A. 154/2021 in E.P. 66/2018 in O.S. 321/2015

Between : **Mylapalli Narasimha Murty**
--Petitioner/Decree-Holder.
And : **Balivada Panduranga & Others**
--Respondents/Judgment Debtors.

To,
2nd Respondent:
Balivada Rajeswari, Wife of late Balivada Panduranga, Door. No. 8-6-90, Gorlevari Veedhi, G.T. Road, Srikakulam.
4th Respondent:
Balivada Nirmal Kumar, Son of late Balivada Panduranga, Door. No. 8-6-90, Gorle vari Veedhi, G.T. Road, Srikakulam. Now residing at Door. No. 4-11-10/3, First Floor, Manisha enclave, Pedda Waltair, Visakhapatnam town and District.

పై నంబర్ మెయిన్ అమలు పిటిషనులో sole judgment debtor అయిన బలివాడ పాండురంగ కాలం చేసివున్నందున, సదరు కాలం చేసిన బలివాడ పాండురంగ వారసులైన మిమ్ములను 2 నుండి 4 respondents / judgment debtors గా పై నంబర్ మెయిన్ అమలు పిటిషను చేర్పించమని కొరుచూ పై నంబరు E.A. 154/2021 పిటిషను డిక్రీహోల్డరు/వాది దాఖలుచేసి వున్నారు. సదరు పిటిషనులో 2 మరియు 4 respondents అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టు నందు **తే.28-06-2023 దీకి వాయిదా అయి వున్నది.** కావున వాయిదా నాడు పగలు **10-30 గంటలకు** మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలియపరచు కోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించడమగునని యిందు మూలంగా తెలియ పరచడమైనది.

SUDHA SURYA RAO
KARANAM APPALANAIDU
Advocates for the Petitioner/D.Hr.,
Srikakulam.

బీమా తక్షణ సాయం అందజేత

ప్రజాశక్తి -గాజువాక : 65వ వార్డు యాతపాలెం సచివాలయ పరిధిలోని అశోక్‌నగర్‌కు చెందిన ఉక్కు ఒప్పంద కార్మికుడు పలివెల కోదండరావు ఇటీవల మరణించాడు. వైఎస్‌ఆర్ బీమా సభ్యత్వం ఉండడంతో బాధిత కుటుంబానికి బీమా పరిహారం కింద మంజూరైన తక్షణసాయాన్ని వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు బుధవారం అందజేశారు. ముందుగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బీమా తక్షణ సాయం రూ.10వేలను కోదండరావు భార్యకు అందజేశారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు వైఎస్‌ఆర్ బీమా పథకం అండగా ఉంటుందనికార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు అన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌరీశంకర్, సత్యనారాయణ, పైడిరాజు, చెరుకూరి రాంబాబు, రెడ్డి, అడిగర్ల రమణ, ఆర్‌పి అనురాధ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, వాలంటీర్ పాల్గొన్నారు.

సిఎండిసి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- సీతమ్మధార : క్రిస్టియన్ మైనారిటీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సిఎండిసి) క్రైస్తవులకు చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ కొనియాడారు. బుధవారం సీతమ్మధారలోని కావలెంట్ క్రైస్ట్‌చర్చిలో సిఎండిసి వర్కింగ్ ప్రెసిడెంట్ గుణ శామ్యూల్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎంపిక చేసిన క్రిస్టియన్లను సిఎండిసి ఆధ్వర్యంలో కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ, సిఎండిసి సేవా కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కుట్టుమిషన్ల పంపిణీ, వైద్యశిబిరాలను నిర్వహణ, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం వంటి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సిఎండిసి వ్యవస్థాపకుడు బిషప్ పండు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సంస్థ చేస్తున్న కార్యక్రమాలనువివరించి, వాటికి సహకరిస్తున్న కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సభ్యులందరికీ గుర్తింపు కార్డులు, బీమా ధ్రువీకరణ పత్రాలు, బ్యాగులను పంపిణీ చేశారు. డాక్టర్ ఎంఎ పాల్, అధ్యక్షులు డేవిడ్ పాల్, జనరల్ సెక్రటరీ జీవనమూర్తి, ఉత్తరాంధ్ర జిల్లాల చైర్మన్ జయకుమార్, ఆయా జిల్లాల చైర్మన్లు స్టీఫెన్, నవీన్ కుమార్,ఉదయ్ కుమార్, రవితేజ, ఎం పాల్, షద్రక్ పాల్గొన్నారు.

98 వార్డులో గడపగడపకు...

ప్రజాశక్తి- సింహాచలం: జివిఎంసి 98వ వార్డులో టీవీ టవర్ పరిసర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు సరైన రోడ్డు సదుపాయం కల్పించాలని కాలనీవాసులు విన్నవించగా,దీనిపై సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ముత్తంశెట్టి వివరణ కోరారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లు నాయుడు, స్థానిక వైసిపి నేతలు కొలుసు ఈశ్వరరావు, ఎర్రవరం బాబు, నరవల అప్పారావు, బొట్ట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలు సృష్టించిన వారిపై చర్యలు

ప్రజాశక్తి- పెందుర్తి :షిప్‌యార్డు లేఅవుట్‌లో ఉద్యోగులు కొనుగోలు చేసిన స్థలాలు తమవేనంటూ తప్పుడు ధ్రువీకరణలతోవచ్చిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని షిప్‌యార్డ్ లేఅవుట్ అసోసియేషన్ అధ్యక్షుడు సదాశివరావు, కార్యదర్శి ఈశ్వరరావు, ప్రసాద్ గజపతిరావు డిమాండ్ చేశారు. బుధవారం కాలనీ పార్కు వద్ద బాధితులంతా నిరసన ఆందోళన చేపట్టారు.

ఆందోళన చేస్తున్న బాధితులు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, షిప్‌యార్డు లేఅవుట్‌లో కొంతమంది ఉద్యోగులు స్థలాలు కొనుగోలు చేసి, ఇళ్లను కూడా నిర్మించుకున్నారన్నారు. అయితే 2013 తర్వాత కొంతమంది ఫోర్జరీ సంతకాలతో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి, ఆ స్థలాలపై తమకు హక్కు ఉందంటూ వచ్చారన్నారు. అప్పట్లో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన వారికి సహకరించిన నాటి తహశీల్దార్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దీనిపై పలుమార్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించామన్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి, నిజమైన స్థలయజమానులకు ఇబ్బందులు గురిచేస్తున్న అయ్యల సోమయాజులు, శ్రీరామశర్మలపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మెగా రక్తదాన శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఉక్కునగరంలోని అంబేద్కర్ కళాక్షేత్రంలో నిర్వహించిన మెగా రక్త దాన శిబిరం విజయవంతమైంది. ఎఐటియుసి ఆధ్వర్యంలో విశాఖపట్నం ఎన్‌టిఆర్ బ్లడ్‌బ్యాంక్, గాజువాక అమ్మ బ్లడ్ బ్యాంక్ సౌజన్యం నిర్వహించిన శిబిరంలో ఉక్కు ఉద్యోగులు, అనుబంధ సంస్థల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని ఎఐటియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు ప్రారంభించగా, విశాఖ ఉక్కు సిఎండి అతుల్ భట్, డైరెక్టర్ పర్సనల్ డాక్టర్ ఎస్‌సి. పాండే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓబులేసు అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారి ప్రాణాలు నిలపాలంటే రక్తదానం చేయడం ఎంతో అవసరమన్నారు. ఉక్కు సిఎండి అతుల్‌భట్ మాట్లాడుతూ, ఎఐటియుసి సామాజిక బాధ్యతగా ఇటువంటి రక్తదాన శిబిరాన్ని భారీ ఎత్తున నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఉక్కు సిఐఎస్‌ఎఫ్ కమాండెంట్ మహ్మద్ అనీఫ్, సిజిఎం జి.గాంధీ, జీఎంహెచ్ఆర్ బినయ్ ప్రసాద్, కె.సంజీవరావు, ఎన్.భాను, డాక్టర్ సారంగి,

రక్తదానం చేస్తున్న సిఐఆర్‌పిఎఫ్ పోలీసులు, తదితరులు

ఎఐటియుసి. ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, అధ్యక్షులు కెఎస్ఎన్.రావు, నాయకులు జె.రామకృష్ణ, ఎ.మసేన్‌రావు, అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, వై.మస్తానప్పు, విళ్ళ రామ్మోహన్ కుమార్, యు.రామస్వామి, డివిఆర్ రెడ్డి, దొమ్మేటి అప్పారావు, వరసాల బాలకృష్ణ, కరణం సత్యారావు, కె.శ్రీనివాస నాయుడు, జిఆర్‌కె. నాయుడు, తాండ్ర కనకరాజు, కార్పొరేటర్ బొండా జగన్ పాల్గొన్నారు. సిఐఎస్‌ఎఫ్ ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు.

హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటివేత

ప్రజాశక్తి -గాజువాక : మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షించవచ్చని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. బుధవారం వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సౌజన్యంతో ఆ కంపెనీ సిఎస్‌ఆర్ నిధులతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వంశీరెడ్డి మాట్లాడుతూ,. సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రజా అవసరాలతో పాటు అభివృద్ధికి సహకరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ డిజిఎం (హెచ్ఆర్) ఆర్ శ్రీనివాసరావు, సిఎస్ఆర్ విభాగం హెడ్ ఎస్‌వి రమణ, సిఎస్‌ఆర్ సభ్యులు రాజీవ్, స్థానిక నాయకులు బొడ్డు గోవింద, ఎస్ రాజారావు, దుర్గారెడ్డి, లోకేష్, సీకు రమణ, నర్సీపట్నం నాయుడు, సత్యం, గొరుసు రామలక్ష్మి, పాల్గొన్నారు.

పెందుర్తి గ్రంథాలయంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు

కొనసాగుతోన్న వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి- పెందుర్తి : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ దాడి శ్రీను ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఆరిపాక శ్రీనివాసరావు పర్యవేక్షణలో 46 మంది చిన్నపిల్లలు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎదుగుతున్న పిల్లలు తీసుకోవాల్సిన ఆరోగ్యసూచనలు చేశారు. కార్యక్రమంలో దాడి రమణ, చిట్టిబాబు గ్రంథాలయాధికారి బి సూర్యకళ, లైబ్రరీ అభివృద్ధి కమిటీ వైస్ ప్రెసిడెంట్ పెతకంశెట్టి భూలోకరావు సెక్రటరీ ఆదారి రామకృష్ణ, రిసోర్స్ పర్సన్స్ కూచిపూడి డాన్స్ టీచర్ శర్వాణిదేవి, డిగ్రీ స్టూడెంట్ సబీన యాస్మిన్ , మౌనిక టీచర్, కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు..

ములగాడ: వ్యక్తిత్వ వికాసంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తాయని మల్కాపురం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ వి.అజయ్‌కుమార్ అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న చిన్నారుల వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం గ్రంథాలయాల ప్రాధాన్యతపై చిన్నారులకు వివరించారు. ప్రతి పుస్తకాన్ని కొనడం అందరికీ సాధ్యం కాని పరిస్థితుల్లో, గ్రంథాలయానికి వచ్చి, వివిధ విషయాలకు సంబంధించిన గ్రంథాలను చదివి, విజ్ఞానం సముపార్జించాలని సూచించారు. అనంతరం చిన్నారులు వారికి నచ్చిన పుస్తకాన్ని గురించి వివరించారు. లావణ్య ఆధ్వర్యంలో నృత్యంపై శిక్షణనిచ్చారు ప్రముఖ కవి కె. సత్తిరాజు, కార్మిక నేత బి. సత్యానందం పాల్గొన్నారు.

సింహాచలం: అడివివరం గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థుల్లో సృజనాత్మక పెంపొందించేందుకు క్విజ్ పోటీలను నిర్వహించారు. అడివివరం పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి అప్పలస్వామి ఉపాధ్యక్షులు బంటుపల్లి మహేష్ గ్రంథాలయాన్ని సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించి, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి నరసింహం ఆధ్వర్యంలో విద్యార్థులకు బిస్కెట్, మజ్జిగ, కూల్‌డ్రింక్స్ అందజేశారు. కార్యక్రమంలో బిపి రాజేంద్రప్రసాద్, సూర్యనారాయణ రాజు, ఎ.భానుమూర్తి పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కోటవురట్ల: స్థానిక శాఖ గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు డిబేట్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు అన్ని భాషల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ మస్తాన్ పాల్గొన్నారు.

గొలుగొండ: స్థానిక గ్రంథాలయంలో ఆ శాఖాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. ఏఎస్పై చంద్రరావు మాట్లాడుతూ, పిల్లలు లక్ష్యం నిర్దేశించుకుని, సాధనకు కృషి చేయాలన్నారు. క్రమశిక్షణతో ఉండి, పెద్దలను గౌరవించాలన్నారు.

నేరాలు ఘోరాలు

రూ.2 వేల నోట్లు మార్పిడి పేరుతో మోసం

- ముగ్గురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రెండు వేల రూపాయల నోట్లను మార్చే ముగ్గురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేసామని డిసిపి-1 విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. డిసిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నోట్లు మార్పిడి పేరుతో ఈ నెల 3వ తేదీన రూ.60 లక్షల రూ.500 నోట్లను పట్టుకొని నిందితులు పరారయ్యారని విజయవాడకు చెందిన టి.కిశోర్ 2వ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు జరిపి డబ్బు పట్టుకుపారిపోయిన ధర్మారావు, డాలా సునీల్, అహ్మద్ మొహిద్దీన్‌ను పట్టుకున్నారు. వారి రూ.60 లక్షలు రికవరీ చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మిగిలిన వ్యక్తుల కోసం దర్యాప్తు చేసి, తదుపరి చర్యలు తీసుకుంటామని డిసిపి తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : మండలంలోని రుక్మిణిపురంలో బుధవారం డిగ్రీ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. యలమంచిలి రూరల్ పోలీసుల కథనం ప్రకారం... రుక్మిణి పురం గ్రామానికి చెందిన రైల్వే కూలి కాళ్ల సత్తిబాబు కుమారుడు కాళ్ల దుర్గాప్రసాద్ (22) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చదువుపై ఆసక్తి లేక ఇంట్లో గొడవపడి ఈనెల 6వ తేదీన అదే గ్రామంలో నివసిస్తున్న తన తాతయ్య అమ్మమ్మల ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం ఏడు గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. అనంతరం వారి తాతయ్య వచ్చేసరికి దుర్గా ప్రసాద్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో స్థానికుల సహాయంతో హుటాహుటిన ప్రైవేట్ అంబులెన్స్‌లో అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స కొరకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మృతి చెందాడు. తండ్రి కాళ్ల సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యలమంచిలి రూరల్ ఎస్సై కె.సన్నిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పద్మనాభుని ఆలయ పునర్నిర్మాణానికి నిధులు

ప్రజాశక్తి- పద్మనాభం : పిడుగుపాటుకు పాక్షికంగా దెబ్బతిన్న మండలకేంద్రమైన పద్మనాభం గ్రామంలో అనంత పద్మనాభ స్వామి కొండపై ఉన్న ఆలయ పునర్నిర్మాణానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు బుధవారం సంబంధిత దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులు కొలతలు వేసి, అంచనా ప్రతిపాదనలు రూపకల్పనకు సిద్ధమౌతున్నారు. ఆరేళ్ల క్రితం పద్మనాభంలోని కొండపైనున్న పద్మనాభుని ఆలయంపై పిడుగుపడడంతో పాక్షికంగా దెబ్బతింది.ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, విజయనగరం రాజు పూసపాటి అశోక్ గజపతిరాజు దీనిపై స్పందిస్తూ, పాడైన పద్మనాభుని ఆలయాన్ని పునర్నిర్మించాలని దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. ఈమేరకు దేవాదాయశాఖ కమిషనర్‌కు రూ.60 లక్షలు అవసరమని ప్రతిపాదనలు పంపగా, నిధులు మంజూరు కావడంతో పనులకు ఉపక్రమిస్తున్నారు. చేపట్టాల్సిన పనులపై సర్వే చేసి, అంచనాలు రూపొందించి టెండర్లను ఆహ్వానించడంద్వారా పనులు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. బుధవారం దేవాదాయశాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎవివి శివప్రసాద్, అసిస్టెంట్ స్థపతి మీనాక్షి దేవాలయ కొలతలు వేయగా, ఆలయ పురోహితులు, తదితరులు సహకరించారు.

నేడు రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి- సీతమ్మధార : సీతమ్మధార సాయిబాబా గుడి వద్ద రూ.2.50 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు 14వ వార్డు వైసిపి కార్పొరేటర్ అనిల్‌కుమార్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ కార్యక్రమానికి నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు, జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

వారాహి ఆర్గనైజింగ్ కమిటీ సభ్యునిగా సందీప్

ప్రజాశక్తి -ఆనందపురం: ఈనెల 14న అన్నవరం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉభయ గోదావరి జిల్లాల్లో తలపెట్టిన వారాహి యాత్రకు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యునిగా భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సందీప్ పంచకర్లను నియమించారు.తనకుగురుతర బాధ్యతలు అప్పగించడంపై సందీప్ ఆనందం వ్యక్తం చేశారు.

తొమ్మిది మంది 'గీతం' దంత వైద్య విద్యార్థులకు

రిలయన్స్ ప్రతిభా పురస్కారాలు

ఒక్కొక్కరికీ రూ.2లక్షల నగదు ప్రోత్సాహకం

రిలయన్స్ పురస్కారానికి ఎంపికైన గీతం దంత వైద్యవిద్యార్థులు

ప్రజాశక్తి- మధురవాడ :జాతీయస్థాయిలో అండర్ గ్రాడ్యుయేట్ విద్యను అభ్యసించే విద్యార్థులలో ప్రతిభ గల వారిని ప్రముఖ కార్పొరేట్ సంస్థ రిలయన్స్ ఏటా అందిస్తున్న ప్రతిభా పురస్కారాలకు ఈ ఏడాది గీతం దంత వైద్య కళాశాల, ఆస్పత్రికి చెందిన తొమ్మిది మంది దంత వైద్య విద్యార్థినులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సీతారామరాజు తెలిపారు. ఈ ప్రతిభ అవార్డుల ఎంపిక కోసం రిలయన్స్ సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో ఐదు వేల మంది విద్యార్థులు పాల్గొనగా, ఆంధ్రప్రదేశ్ నుంచి గీతం దంత విద్యార్థులు తొమ్మిది మంది ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారం కింద. ఎంపికైన విద్యార్థులకు ఒక్కొక్కరికి రిలయన్స్ సంస్థ రూ.2 లక్షల నగదు బహుమతి అందజేస్తుందన్నారు. గీతం దంత వైద్య కళాశాలలో బిడిఎస్ విద్యార్థులు ఎ.శశికళ, ఎమ్.గుణ పద్మప్రియ, జి.మేఘన, కె.కీర్తన, ఎమ్.శ్రీలయ, నూరియా ఫిజా షేక్, పి.శ్రీజ, ఆర్.రామ వరలక్ష్మీ, కె.శ్రీవర్షిణి రిలయన్స్ ప్రతిభా పురస్కారాలకు ఎంపిక కావడంపై గీతం అధ్యక్షుడు ఎమ్.భరత్, కార్యదర్శి ఎమ్.భరద్వాజ వారిని అభినందించారు.

ముగిసిన వేసవి క్రీడా శిబిరం

మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు వీరే

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సి.డార్ స్కూల్‌లో జివిఎంసి, రెమో లయన్స్ (డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్) సంయుక్తంగా నిర్వహించిన వేసవి క్రీడా శిబిరం బుధవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పాల్గొని, కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందిన విద్యార్థులను అభినందించారు. ఆత్మ రక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని, వేసవి శిక్షణ శిబిరంలో దీన్ని నేర్చుకోవడం బాగుందన్నారు. నేర్చుకున్న విద్యను దుర్వినియోగం చేయవద్దని సూచించారు. శిక్షకుడు రెమో యాదవ్ మాట్లాడుతూఇటీవల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇండో నేపాల్ కరాటే ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు రెమో లయన్స్ టీమ్‌కు 20 పతకాలు లభించాయన్నారు. వాటిల్లో ఏడు స్వర్ణం, ఆరు రజతం, ఏడు కాంస్య పతకాలున్నాయన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : 11వ వార్డు ఆరిలోవ, పార్వతీనగర్‌లలో రూ 3.80 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి బుధవారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 11వ వార్డులో ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సిఎం జగన్ సారధ్యంలో విశాఖను సుందరనగరంగా తీర్చిదిద్దుతామన్నారు. వైసిపి నాయకులు గొలగాని శ్రీనివాసరావు, జివిఎంసి ఇంజనీరింగు అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

స్టీల్ కాంట్రాక్టు కార్మికులకు

బోనస్ పునరుద్ధరించాలి

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం :ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు తొలగించిన బోనస్‌ను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో ఉక్కు ఎడ్మినిస్ట్రేషన్ భవనం వద్ద బుధవారం ధర్నా చేశారు. యూనియన్ అధ్యక్షుడు జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ21 వేలు దాటిందని బోనస్ సీలింగ్ చట్టం ప్రకారం బోనస్ తొలగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు స్టీల్, ఎల్ఐసి, రైల్వే, బ్యాంకులు ఇతర సంస్థలలో లక్ష రూపాయలు దాటిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా పేరుతో బోనస్ ఇస్తున్నారన్నారు. కానీ కాంట్రాక్టు కార్మికులకు మాత్రం సీలింగ్ పేరుతో ఎత్తేయడం సబబు కాదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు బోనస్ పునరుద్ధరణ బాధ్యతను స్టీల్ యాజమాన్యమే చేపట్టి కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు.

యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం ఇటీవల నోటీస్ పే, ఐయస్ఐ, ఇప్పుడు బోనస్ తీసివేసి కార్మికుల హక్కులపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. స్టీల్ ఉత్పత్తిలో పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు అన్యాయం తలపెడితే సిఐటియు చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు కార్యక్రమంలో నాయకులు వివి రమణ, చట్టి నర్సింగరావు, కె సత్యవతి, ఎ శ్రీను, ఆర్‌టి రాజు,ఎన్ అప్పారావు, బి గంగరాజు, అప్పలరాజు, ప్రసాద్, ఆనంద్, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

తేజ ఫైటర్ క్రాఫ్ట్ సృష్టికర్తకు 'గీతం' డాక్టరేట్

సినీ నటి వాణిశ్రీకి గౌరవ డాక్టరేట్

10న గీతం స్నాతకోత్సవంలో అందజేత

డాక్టర్ కోటా హరినారాయణ

సినీ నటి వాణిశ్రీ

ప్రజాశక్తి- మధురవాడ : ఈ నెల 10న నిర్వహించనున్న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 14వ స్నాతకోత్సవంలో తేజ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ సృష్టికర్త, పద్మశ్రీ అవార్డు గ్రహిత డాక్టర్ కోటా హరినారాయణకు గీతం వర్సిటీ గౌరవ డాక్టరేట్ (డాక్టర్ ఆఫ్ సైన్స్) ప్రదానం చేయనుందని విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తెలిపారు. అలాగే ప్రముఖ తెలుగు సినీనటి వాణిశ్రీకి డిలిట్ గౌరవ డాక్టరేట్‌ను అందిస్తున్నట్లు ప్రకటించారు. గీతం స్నాతకోత్సవానికి భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) కార్యదర్శి డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా రానున్నారని తెలిపారు. గీతం వర్సిటీ విశాఖ ప్రాంగణం నుంచి ఇంజనీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, లా, నర్సింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్, సామాజిక శాస్త్రాలను 2022-23 విద్యాసంవత్సరంలో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు, పరిశోధక విద్యార్థులకు స్నాతకోత్తర పట్టాలను, ప్రతిభ గల విద్యార్థులకు బంగారు పతకాలను అందజేస్తామన్నారు.

దళితులపై దమనకాండకు టిడిపి నిరసన

హనుమాయమ్మను హంతకులను అరెస్ట్ చేయాలని డిమాండ్

పెదగదిలి అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నేతల నిరసన

ప్రజాశక్తి - ఆరిలోవ : రాష్ట్రవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ప్రకాశం జిల్లాలో దళిత మహిళా హనుమాయమ్మను హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని టిడిపి దళిత నాయకులు డిమాండ్ చేసారు. దళితులపై దమనకాండకు నిరసనగా విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు బుడుమూరు గోవిందు ఆధ్వర్యంలో పెదగదిలి కూడలి, అంబేద్కర్ విగ్రహం వద్ద 9, 10, 11, 12, 13 వార్డుల టిడిపి దళిత నేతలు, ఇతర పార్టీ శ్రేణులునిరసన చేపట్టాయి. కార్యక్రమంలో పాల్గొన్న తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామక్రిష్ణబాబు ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దళిత మహిళ అనుమాయమ్మ హంతకులను అరెస్టు చేయాలని నినాదాలు చేసారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామక్రిష్ణబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై ఇష్టారాజ్యంగా దాడులు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. దళిత వ్యతిరేక చర్యలు చేపడుతున్న వైసిపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోడుగు కుమార్, దళిత నాయకులు గాడి సత్యం, బాదరు బాలరాజు, తురకపూడి బాలస్వామి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కుళాయిల ద్వారా కలుషిత నీరు

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి కుళాయిల ద్వారా మంచినీటి విభాగం ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న తాగునీరు రంగుమారి, కలుషితమయంగా ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం జాలరి వీధి, రెడ్డివీధి ప్రాంతాల్లో జివిఎంసి సరఫరా చేసిన నీరు పూర్తిగా రంగుమారి ఉండడంతోపాటు ఇబ్బందికరమైన అవశేషాలు కనిపిస్తున్నాయని, వాటిని పట్టుకోవాలంటేనే ఏవగింపుగా ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. జివిఎంసి తాగునీటి విభాగం స్పందించి, కుళాయిల ద్వారా కలుషిత నీటి సరఫరాపై తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కుళాయిల ద్వారా వచ్చిన రంగు మారిన నీరు

టిడిపి మేనిఫెస్టో పోస్టర్ ఆవిష్కరణ

మేనిఫెస్టో పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీభరత్, రాజాబాబు

ప్రజాశక్తి -భీమునిపట్నం : టిడిపి మేనిఫెస్టో పొందుపర్చిన సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త ఎం శ్రీభరత్ పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజాబాబుతో కలిసి టిడిపి మేనిఫెస్టో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ, ప్రజలకు భద్రత, భరోసా కల్పించే చంద్రన్న పాలన రానుందన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజాబాబు మాట్లాడుతూ, 2024 ఎన్నికల్లో టిడిపి అధికారం చేపట్టనుందని, అధికారంలోకి వచ్చిన వెంటనే ముందుగా పేదల ఆకలిని తీర్చే అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజక వర్గ పరిశీలకులు కోట్ని బాలాజీ, పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మొల్లి లక్ష్మణరావు, వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు కశిరెడ్డి దామోదరరావు, మండల పార్టీ అధ్యక్షులు డిఎవిఎన్ రాజు, మాజీ జెడ్‌పిటిసి ఎస్ అప్పారావు, పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి పిట్టా సురేష్ పాల్గొన్నారు

విద్యార్థుల ఉన్నతికి క్రీడలు దోహదం

-డిసిపి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి- ఆరిలోవ : విద్యార్థుల ఉన్నతికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని నగర శాంతిభద్రతల డిసిపి విద్యాసాగర్ నాయుడు అన్నారు. బుధవారం తోటగరువు ఉన్నతపాఠశాలలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ త్రివిక్రమవర్మ సారథ్యంలో ఆరిలోవ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరంలో వివిధ క్రీడా అంశాల్లో విద్యార్థులు శిక్షణ పొందేలా తల్లిదండ్రులు ప్రోత్సాహించడం అభినందనీయమన్నారు. వేసవి శిక్షణా శిబిరంలోని విద్యార్థులకు పౌష్టికాహారం, ఇతర సదుపాయలను కల్పించిన ఫినాకిల్ ఆసుపత్రి ఇందిరా, అపోలో వైద్యులు రాజేష్ వెంకట్‌కు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణతో క్రీడాశిక్షణ అందేలా చర్యలు చేపట్టిన ఆరిలోవ సిఐ సోమశేఖర్‌ను డిసిపి అభినందించారు.

విద్యార్థులకు శిక్షణనిచ్చిన బాక్సింగ్ కోచ్‌లు బంగారరాజు, రామారావు, బాస్కెట్ బాల్ కోచ్‌లు మీనా,హేమా, ఫుట్‌బాల్ కోచ్‌లు సుమన్, జాన్, వాలీబాల్ కోచ్‌లు అప్పలరాజు, ఎర్రాజీ, కబడ్డీ కోచ్ చైతన్య, యోగా కోచ్ చిన్నారావు, అప్పలకొండలను డిసిపి విద్యాసాగర్, ఎసిపి మూర్తి అభినందించారు. తమ పాఠశాల విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో తర్ఫీదునిచ్చిన కోచ్‌లు, దీనికి సహకరించిన పోలీసులు, ఆసుపత్రి యాజమాన్యాలకు హెచ్ఎం భవానీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం ఫినాకిల్ ఆసుపత్రి బిడి ఇందిరా, డాక్టర్ కృష్ణ, అపోలో వైద్యులు డాక్టర్ రాజేష్ వెంకట్ ఆరిలోవ ఎస్‌ఐలు సూర్యనారాయణ, సునీల్ పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన సన్నిధిలో

హైకోర్టు జడ్జి దంపతులు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను హైకోర్టు జడ్జి బివిఎల్ఎన్ చక్రవర్తి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇఒఇ నరసింహారాజు, సూపరెంటిండెంట్ పాలూరి నరసింహారావు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకొని, బేడా మండపం చుట్టూ ప్రదక్షిణము చేసి, స్వామి అంతరాలయంలోనూ గోదాదేవి సన్నిధిలోను గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, అధికారులు స్వామివారి తీర్థప్రసాదాల్ని శేష వస్త్రాన్ని, చిత్రపటాన్ని అందజేశారు.

ఒడిశా రైలు ప్రమాద మృతులకు సిఐటియు నివాళి

ప్రజాశక్తి-పరవాడ

ఒడిశాలోని బాలసోర్ రైలు ప్రమాదాల్లో మృతి చెందినవారికి సిఐటియు ఆధ్వర్యాన బుధవారం సాయంత్రం స్థానిక ఫార్మసిటీలో కొవ్వొత్తులతో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ప్రమాదంలో దాదాపు 300 మంది మృత్యువాత పడటం, మరో వెయ్యి మందికి పైగా క్షతగాత్రులుగా మారి దేశంలోనే అత్యంత విషాద ఘటనగా మారిందని పేర్కొన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైల్వేలో ప్రైవేటీకరణ జరిగిందని, 3 లక్షల వరకు రైల్వే శాఖలో ఖాళీలు భర్తీ చేయలేదని, ఈ కారణంగానే ఈ ఘోర ఘటన జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని, రైల్వే ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలని, ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్రి వెంకినాయుడు, కర్రి పోతి నాయుడు, రామునాయుడు, వై అప్పారావు, కె.ధారబాబు, కృష్ణ పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : ఒడిశా రైలు ప్రమాద ఘటనకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బాధ్యత వహించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో రైలు ప్రమాద మృతులకు మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాయవరపు సురేష్, వానపల్లి సత్యనారాయణ, చిన్నికృష్ణ, సుందరపు వెంకట అప్పారావు, ఏవీఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న గనిశెట్టి, వెంకటాపురం గ్రామస్తులు

మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద

గ్రావెల్ రోడ్లు, ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశం బుధవారం అధ్యక్షురాలు పలకా యశోద రవి అధ్యక్షతన మార్కెట్ యార్డ్ పరిపాల భవనంలో జరిగింది. ఈ సమావేశంలో పలు తీర్మానాలను కమిటీ సభ్యులు ఆమోదించారు. మార్కెట్ యార్డ్ తూర్పు భాగంలో ప్రహరీ నిర్మాణం, అనకాపల్లి, కసింకోట మండలాల్లోని ఒక్కొక్క గ్రామానికి రూ.2 లక్షల చొప్పున 20 గ్రామాల్లో గ్రావెల్ రోడ్లు వేయడానికి బడ్జెట్ మంజూరు కొరకు, మెయింటెనెన్స్ కొరకు రూ.10 లక్షల మంజూరు కొరకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించడానికి తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి డి శకుంతల, ఉపాధ్యక్షులు కరక సోమినాయుడు, మెంబర్లు నీటిపల్లి లక్ష్మి, మరిపల్లి శోభ, బొబ్బిలి శ్యామల, ఈగల నూకరత్నం, దాడి తులసి కుమారి, బొడ్డు అచ్చిరాజు, పిట్ల అప్పలరాజు, తెరపల్లి నాగ సంతోష్ కుమార్, దాడి కుమార్ కృష్ణ, ఒమ్మి మధుబాబు, కొణతాల విజయ్ కుమారి, గుండా రమేష్ గుప్తా, గొంతిన శివ, ఏడి అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా ఉన్న వడ్డాది ప్రధాన కూడలి

ఎండలతో ఉక్కిరిబిక్కిరి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ఎండల తీవ్రతకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బుధవారం రికార్డుస్థాయిలో 42డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో జనం విలవిలలాడిపోయారు. గత వారం రోజుల నుండి పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఉదయం తొమ్మిది గంటలకే ఇళ్లకు చేరుకుంటున్నారు. ఉక్కపోతతో విపరీతంగా చెమట కారుతుండడంతో భవన నిర్మాణ కార్మికులు, ఇతర పనులకు వెళ్లే దినసరి కూలీలు త్వరగా అలసట చెంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న సమయంలో రోడ్లపై జనసంచారం పూర్తిగా తగ్గిపోయింది. ఎండలు మండిపోతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

తహశీల్దారుగా వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట తహసీల్దార్‌గా కె.వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రోలుగుంట మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ ఎస్వీ అంబేద్కర్ నక్కపల్లికి బదిలీపై వెళ్లారు. డీటీ మురళీధరరావు రావికమతం మండలానికి, రోలుగుంట డిటి త్రివేణి బుచ్చయ్యపేటకు బదిలీ అయ్యారు. బుచ్చయ్యపేట మండల ఏఎస్వోగా శ్రీకాకుళం నుంచి విజయబాబు బదిలీపై వచ్చారు.

ఈదురుగాలులతో వర్షం

నేల కూలిన చెట్టు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని బుధవారం బలమైన ఈదురు గాలులతో వర్షం కురిసింది. గాలి బీభత్సానికి మండల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడటం కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఎక్కువగా మామిడి, జీడి మామిడి, అరటి చెట్లు నేలకూలాయి. కొన్ని చోట్ల రోడ్డుకు అడ్డంగా చెట్లు పడ్డడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వర్షంతో పాటు వడగల్లు కూడా పడ్డాయి. ఈదురు గాలుల వల్ల మామిడికాయలు నేలరాలాయి. వడగల్లకు మామిడి కాయలు దెబ్బతిన్నాయి. ఈ నెలలో ఎక్కువసార్లు ఈదురు గాలులు రావడం వలన ఎక్కువగా విద్యుత్తు శాఖకు నష్టం జరిగింది.

నేల కూలిన చెట్లు

అచ్యుతాపురం : అచ్చుతాపురం మండలంలో మంగళవారం రాత్రి బీభత్సమైన ఈదురు గాలులు వీచాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మల్లవరం గ్రామంలో అరటి తోటలు ధ్వంసమయ్యాయని గ్రామ సర్పంచ్ పిన్నమరాజు వాసు తెలిపారు. తిమ్మరాజుపేట గ్రామంలో కొబ్బరి చెట్టు నేలకూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని గ్రామ సర్పంచ్ పెరగడం భాగ్యలక్ష్మి బాపు నాయుడు తెలిపారు. ఈదురు గాలులకు మంగళవారం రాత్రి మోసయ్యపేట గ్రామంలో 25 ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము తెలిపారు. దీనిపై విద్యుత్తు శాఖ అధికారులకు తెలియజేసినా ఎవరూ పట్టించుకోలేదని చెప్పారు. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంపై ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

మల్లవరంలో ధ్వంసమైన అరటి తోట

తెగిపడిన విద్యుత్ తీగ

అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- మునగపాక రూరల్

మండలంలోని తోటాడ గ్రామంలో కాళీమాత ఆలయం వీధిలో బుధవారం ఉదయం విద్యుత్ తీగ తెగిపడడంతో అక్కడి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానిక మహిళలు కుళాయి నీళ్ల పట్టుకొని పక్కన నిల్చొని ఉండగా ఒక్కసారిగా తీగ తెగి కిందపడింది. వెంటనే భయంతో ఇళ్లలోకి పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో లైన్‌మెన్ అసిస్టెంట్ రాము హుటాహుటిన అక్కడికి చేరుకున్న విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం మరొకరి సహాయంతో తెగిన తీగ స్థానంలో వేరొక తీగను అమర్చి తరువాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సమీపంలో వివాహ వేడుకకు వచ్చిన బంధువులంతా అటుగానే ఉదయం నుంచి రాకపోకలు సాగించారు. అయితే అప్రమత్తమైన కాలనీ వాసులు అటువైపు ఎవ్వరినీ రానీయకుండా మరమ్మతు పూర్తయ్యేదాక జాగ్రత్త పాటించారు. ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇళ్ల ముందర ఉన్న కొబ్బరి చెట్ల కారణంగా కొమ్మలు తీగలపై పడడంతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. పాడైన విద్యుత్ లైన్లను మార్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు సాధించిన డైట్

ప్రజాశక్తి-అనకాపల్లి

నేషనల్ ఇనిస్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేంవర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ఇన్నోవేషన్ కింద విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ 151 - 300 ర్యాంకింగ్ బ్యాండ్‌లో నిలిచింది. ఈ స్కోర్ కాలేజీలో అనుసరించే బోధన విధానాలు, జరిగే పరిశోధనలపై ఆధారపడి ఉంటుందని కరస్పాండెంట్ రత్నాకర్ తెలిపారు. ఈ సందర్భంగా బోధనా సిబ్బంది, విద్యార్థులను ఆయన అభినందించారు .ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, విభాగాధిపతులు, ఆర్ అండ్ డి కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ర్యాంకింగ్ సర్టిఫికెట్ చూపుతున్న డైట్ కరస్పాండెంట్ రత్నాకర్

ఫ్రూట్ కవర్లతో నాణ్యమైన మామిడి దిగుబడి

ప్రజాశక్తి-కె.కోటపాడు

పండ్లలో రారాజు మామిడి... ఆ పండును ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు... వాటి రుచి అలాంటిది మరి. కాని కొన్నేళ్లుగా మామిడి పంటలో నాణ్యత తగ్గుతూ వస్తోంది. ప్రధానంగా బయటకు కాయ బాగానే కనిపిస్తున్నా లోపల పురుగు పట్టేస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నాణ్యమైన మామిడి పండ్లు పండించేందుకు ఉద్యానవన శాఖ ఈ ఏడాది మండలంలోని కొన్ని తోటల్లో ప్రయోగాత్మకంగా ఫ్రూట్ కవర్లు పంపిణీ చేసింది. ఈ కవర్లు తొడిగిన పండ్లు మంచి రంగుతో చూపరులను కట్టిపడేస్తున్నాయి. ఈ కవర్లు పూర్తిగా కలప గుజ్జుతో తయారై కాయలకు రక్షణగా నిలుస్తున్నాయి. నిమ్మకాయ సైజు పరిమాణంలో ఉన్నప్పుడు రైతులు ఈ ఫ్రూట్ కవర్లను తొడిగారు. 50 రోజులపాటు ఉంచి తీసి చూస్తే నాణ్యమైన బంగారు రంగుతో కూడిన కాయలు దర్శనమిచ్చాయి. సాధారణ కాయలకు, కవర్లు తొడిగిన కాయలకు ఎంతో వ్యత్యాసం కనిపించింది. సాధారణ కాయ సైజు కన్నా ఎక్కువ పరిమాణం పెరిగింది. కవర్లు తొడగటంతో మంచు, పురుగు, టెంక పురుగు, పండు ఈగలు సోకకుండా కాయలకు రక్షణ కలిగిస్తాయని స్థానిక ఉద్యానవన శాఖ అధికారి కిరణ్మయి తెలిపారు. తొడిములు దృఢంగా తయారై ఈదురుగాలులకు, తుఫానులకు కాయ కింద పడదని, ఎక్కువ రోజులు పండు నిల్వ ఉంటుందని చెప్పారు. ఉద్యానవన శాఖ అధికారుల సూచనలతో మామిడి పంటలను అభివృద్ధి చేస్తే నాణ్యమైన పండ్లతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఆమె పేర్కొన్నారు. విచ్చలవిడిగా పురుగు మందులు వాడటం, మామిడికాయలకు రక్షణ లేకపోవడం తదితర కారణాలవల్ల మార్కెటింగ్ తగ్గుతుందని తద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. వచ్చే సంవత్సరం అధిక సంఖ్యలో మామిడి రైతులు ఫ్రూట్ కవర్ల విధానాన్ని పాటిస్తారని భావిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

ఫ్రూట్ కవర్లలో పండిన మామిడి పండ్లు

రైలు ఎక్కుతూ జారి పడిన ప్రయాణికులు

నలుగురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో బుధవారం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతూ జారి పడిపోవడంతో ఇద్దరు మహిళలు, ఒక పురుషునికి తీవ్ర గాయాలు, ఒక పాపకు స్వల్ప గాయాలయ్యాయి. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో తమ బంధువుల వివాహ వేడుకలకు హాజరయ్యేందుకు 9 మంది (ఆరుగురు పెద్దవారు, ముగ్గురు పిల్లలు) అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు బుధవారం ఉదయం చేరుకున్నారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఎక్కుతుండగా వారిలో ద్రాక్షాయిని, అన్నపూర్ణ, ఒక పాప ప్లాట్‌ఫారంపై పడిపోయారు. వారిని రైలు ఎక్కించేందుకు వచ్చిన ఆలం శంకర్ కాలు మడమ భాగం ట్రైన్‌కు ప్లాట్ ఫామ్‌కు మధ్య ఇరుక్కుపోవడంతో కుడికాలు పాదం తెగిపడింది. ఈ ప్రమాదంలో ద్రాక్షాయిని, అన్నపూర్ణకు వెన్నెపూస భాగంలో తీవ్ర గాయాలు, కాగా పాపకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రికి తరలించగా ఆలం శంకర్, ద్రాక్షాయినిలను మెరుగైన వైద్య చికిత్స కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అన్నపూర్ణ స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కేసును రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాలు పాదం తెగిపడిన శంకర్

వెన్నెపూస భాగంలో తీవ్రంగా గాయపడిన ద్రాక్షాయిని

రమణమూర్తిని అభినందిస్తున్న దృశ్యం

టీచర్స్ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్‌గా రమణమూర్తి

ప్రజాశక్తి-చోడవరం

రాష్ట్ర టీచర్స్ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్‌గా ఉపాధ్యాయుడు పప్పల రమణమూర్తి నియామకమయ్యారు. రమణమూర్తి 1998 బ్యాచ్ ఉపాధ్యాయ నియామకాల్లో ఇటీవల ఎంపికయ్యారు. చోడవరం ఎమ్మెల్యే ధర్మశ్రీకి సోదరుడైన రమణమూర్తి గాజువాక కోర్టులో న్యాయవాద వృత్తి చేస్తూ కొన్నేళ్ల క్రితం చోడవరం సుగర్ ఫ్యాక్టరీలో కార్మిక శాఖ అధికారిగా చేరారు. అనంతరం ప్రమోషన్‌పై అదే ఫ్యాక్టరీలో ఏవోగా విధులు నిర్వహించేవారు. 1998 నియామకమైన టీచర్స్ బ్యాచ్ కోర్టు అడ్డంకులు తొలగడంతో ఇటీవల విధుల్లోకి చేరారు. ఆయన పద్మనాభ మండలంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. రమణమూర్తి లీగల్ అడ్వైజర్‌గా కావడంతో పలువురు అభినందనలు తెలిపారు.

మరిడిమాంబ ఆలయం నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి బుచ్చయ్యపేట

మండలంలోని కెపి.అగ్రహారం గ్రామంలోని మరిడిమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణానికి జెడ్‌పిటిసి దొండ రాంబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధుల నుండి రూ.5 లక్షల నిధులను మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు మల్ల బుల్లిబాబు, సర్పంచులు ఎల్లపు విజయ్ కుమార్, పడాల నాగ భూషణం, ఎంపిటిసీలు సీతా సన్యాసినాయుడు, ఎంపిటిసి దేవర అప్పారావు, ముచ్చకర్ల నాగేశ్వరరావు, పూడి రామారావు, ఉప సర్పంచ్ దేవర మూసలి నాయుడు, కమిటీ చైర్మన్ ముమ్మిడిశెట్టి రామోజీ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి బోరు ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి- మునగపాక రూరల్

మునగపాక ఇందిరమ్మ కాలనీలో కొత్తగా మంచినీరు బోరు ఏర్పాటుకు స్థానిక సర్పంచ్ దిమ్మల అప్పారావు బుధవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత బోరు పూర్తిగా నీరు రాకపోవడంతో కాలనీ ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ఈ నూతన మంచినీటి బోరు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటకోట సతనారాయణ, వార్డు సభ్యులు దాడి పోలీసు అప్పారావు, కోయిలాడ రామచంద్రరావు, ఆడారి వెంకట అప్పారావు, దాడి వీర నాయుడు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో 104 వైద్య శిబిరం

ప్రజాశక్తి- మునగపాక రూరల్

104 వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాంగ్రేగుల నూకరాజు కోరారు. మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో 104 వైద్య శిబిరాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. వడదెబ్బ తగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. వైద్య శిబిరంలో పీహెచ్‌సీ వైద్యురాలు దుర్గాప్రవల్లిక సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు సీతామహాలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి భవాని, ఏఎన్ఎం, మంగ, హెల్త్ అసిస్టెంట్ జ్యోతి లాల్, ఆశ కార్యకర్తలు పార్వతి, ఆదిలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ నూకరాజు

కొనసాగుతున్న బాలికల సాధికారత మిషన్

ప్రజాశక్తి-పరవాడ

ఎన్‌టిపిసి సింహాద్రిలో బాలికల సాధికారత మిషన్ కొనసాగుతోంది. బుధవారం ఎన్‌టిపిసి సింహాద్రిలో జరిగిన జిఇఎమ్-2023 వర్క్‌షాప్‌లో జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పట్టన్ శెట్టి పాల్గొన్నారు. బాలికలతో ముచ్చటించారు. జిఇఎమ్ పార్టిసిపెంట్స్‌తో జరిగిన ఇంటరాక్షన్ సందర్భంగా, బాలికల సాధికారతపై దృష్టి సారించి, కొత్త నైపుణ్యం నేర్చుకోవడం, వ్యక్తిత్వ వికాసాన్ని ప్రోత్సహించడం కోసం ఎన్టీపిసి సింహాద్రి చేసిన కృషిని జిల్లా కలెక్టర్ అభినందించారు. పిల్లలను పెద్దగా ఆలోచించి, పెద్దగా కలలు కంటూ, ఏదో ఒకటి కావాలని, జీవితంలో విజయం సాధించాలని చైతన్యపరిచారు. కార్యక్రమంలో ఎన్టీపిసి సింహాద్రి సీనియర్ అధికారులు సంజయ్ కుమార్ సిన్హా ప్రాజెక్ట్ హెడ్ గోవింద రాజన్ చీఫ్, జనరల్ మేనేజర్ సిపిజి3 సిజిఎమ్ రుమా డి శర్మ, హెచ్ఆర్‌హెడ్, సిఎస్ఆర్ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

గ్రామీణాభివృద్ధిలో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలి

కుమ్మరి వృత్తిదారునితో మాట్లాడుతున్న పావని తదితరులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

గ్రామీణాభివృద్ధిలో విద్యార్థులను భాగస్వామ్యం చేసేందుకు ఉన్నత్ భారత్ అభియాన్ దోహదపడుతుందని ఉన్నత్ భారత్ అభియాన్ ఆంధ్రాయూనివర్సిటీ రీజినల్ కోర్డినేటర్ పావని తెలిపారు. బుధవారం తంతడి గ్రామంలో చేతి వృత్తిదారులతో ఆమె మాట్లాడారు. చేతి వృత్తులకు ఉన్నత్ భారత్ అభియాన్ వారికి నిధులు కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. గ్రామీణ కళలు, చేతి వృత్తులను ప్రోత్సహించడానికి ఉన్నత్ భారత్ అభియాన్ పెద్దపీట వేస్తుందని చెప్పారు. ప్రతి ఉన్నత విద్యా సంస్థ ఐదు గ్రామాలని దత్తత తీసుకుంటే ఆ గ్రామాలో చేతి వృత్తులను ప్రోత్సహించడానికి నిధులు సమకూర్చునున్నట్లు తెలిపారు. ప్రశాంతి పాలిటెక్నిక్ ఉన్నత్ భారత్ అభియాన్ దత్తత గ్రామమైన తంతడి గ్రామంలో చేతివృత్తిదారులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావ్, ఎన్ఎస్ఎస్ అధికారి మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరస్వామి ఆలయ గాలిగోపురాలపై కలశాల ఏర్పాటు

ప్రజాశక్తి-చోడవరం

స్వయంభు విఘ్నేశ్వర స్వామి ఆలయంలో తూర్పు, పశ్చిమ గాలిగోపురాలపై కలశాలను బుధవారం ప్రభుత్వం విప్, స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ ఏర్పాటు చేశారు. నాలుగవ తేదీ నుండి ఆలయం వద్ద ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జయదేవ్ ఆధ్వర్యంలో నిర్విరామంగా యజ్ఞలు పూజలు, హోమాలు జరుగుతున్నాయి. ఆలయానికి చుట్టూ ఉన్న దేవాదాయ శాఖ స్థలాల్లో ఆక్రమణలను తొలగించి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. 4 వైపుల మాడవీధులను ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నో ఏళ్లగా ఆక్రమణలు తొలగించడానికి ఓట్లు పోతాయన్న భయంతో ప్రజా ప్రతినిధులు ఎవరు వాటి జోలికి వెళ్లలేదు. ఏదేమైనా ఆక్రమణలు తొలగిస్తే తప్ప దేవాలయానికి పూర్వవైభవం రాదని ధర్మశ్రీ తొలగింపులకు శ్రీకారం చుట్టారు. సుమారు రెండు కోట్ల రూపాయలకు పైబడి పనులను చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి, కమిటీ చైర్మన్ ను న్న నాగేశ్వరరావు వడ్డాది నరసింహమూర్తి పంతులు, ఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లా ఎస్‌పి కెవి మురళీకృష్ణని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, జిల్లా కార్యదర్శి మల్ల గణేష్, బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి విల్లూరి రాంబాబు, 83 వార్డు ప్రధాన కార్యదర్శి మల్ల శివన్నారాయణ బుధవారం ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఎస్‌పికి నూకాంబిక చిత్ర పటాన్ని అందజేస్తున్న టిడిపి నేతలు

మట్టి వినాయక విగ్రహాలపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి : మట్టి వినాయక విగ్రహాలనే పూజించండి, పర్యావరణం పరిరక్షించండి అనే నినాదంతో ఈ ఏడాది కూడా విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తామని వినాయక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లా కలెక్టర్లను నేరుగా కలిసి అన్ని జిల్లాల్లో కూడా మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించాలని కోరుతామని చెప్పారు. 2023 సెప్టెంబర్ 19న జరుగు వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనోత్సవానికి బుధవారం స్థానిక లక్ష్మీ గణపతి దేవాలయంలో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కొత్తగా ప్రతిరోజు 30 మంది నిరుపేదలకు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. వినాయక ఘాట్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి స్థానిక ఎమ్మెల్యే, ఎంపీని కలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రేబాక మధు, దేవాలయం ప్రతినిధి పిల్లా పరదేశి నాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం నేత మృతి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపకులు కొసర సోమేశ్వరరావు బుధవారం మృతి చెందారు. సోమేశ్వరరావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏఐటీయూసీ నాయకులు పడాల రమణ, కోన లక్ష్మణ, వివిధ కార్మిక సంఘాల నాయకులు నాగేశ్వరరావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పేమ్మే బాబ్జి, కొసర తాతారావు, గుమ్మల అమ్మతల్లి, పరమేశ్వరరావు, సింహచలం నాయుడు, బాలాజీ, విష్ణు వివిధ కార్మిక సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

సోమేశ్వరరావు (ఫైల్)

టిడిపి మినీ మేనిఫెస్టో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

టిడిపి మినీ మేనిఫెస్టోకు సంబంధించి పోస్టర్‌ను స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఏర్పడుతుందన్నారు. మహాశక్తి పథకంతో మహిళల జీవితాలలో వెలుగులు నింపుతామని, అన్నదాత పథకంతో వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని చెప్పారు. టిడిపి మేనిఫెస్టో ప్రతి ఇంటికి వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పరిశీలికులు బొర్రా నాగరాజు, నాయకులు మళ్ల సురేంద్ర, మాదంశెట్టి నీలబాబు, కొణతాల శ్రీనివాసరావు, ఉగ్గిన రమణ మూర్తి, పచ్చికూర రాము, జోగినాయుడు, పోలారపు త్రినాధ్, బొద్దపు ప్రసాద్, సబ్బవరపు గణేష్, సేనాపతి స్వరూప, కొణతాల రత్న కుమారి, గొంతిన శ్రీనివాసరావు, సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా, టిడిపి నాయకులు

మురా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో మురా కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం బుధవారం ఆ సంఘం ప్రెసిడెంట్ రుత్తల గోవింద్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సిఐటియు నేత డి.సత్తిబాబు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కొటేశ్వరరావు మాట్లాడుతూ, దేశంలో మురా కార్మికులకు సమగ్ర చట్టం లేదని, శక్తి ఉన్నంత కాలం పని చేసి, వయసు మళ్లితే దిక్కులేని బతుకులు బతకాల్సి వస్తుందన్నారు. కూలి డబ్బులు పిల్లలు చదువులు, వైద్యానికే సరి పోని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన చెందారు. ఏళ్ళ తరబడి నర్సీపట్నంలో ఉన్న అనేక మంది కార్మికులకు శాశ్వత ఇళ్ళు లేవన్నారు. అనంతరం నర్సీపట్నం మురా కార్మిక సంఘం సెక్రటరీగా అడిగర్ల రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అడిగర్ల రాజు మాట్లాడుతూ, మురా కార్మికుల సమస్యలు పరిష్కారంకు నిరంతరం పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమలో ఏపి రైతు సంఘం ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి, కోశాధికారి ఎం. రమణ, నాయుడు, నాగేశ్వరరావు, సాంబ, రాము, నానాజీ తదితర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

మస్తరు రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఓ

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని కాగిత గ్రామంలో గొల్లవాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఎంపిడిఓ సీతారామరాజు పరిశీలించారు. కూలీల మస్తరులను తనిఖీ చేశారు. పారదర్శకంగా పనులు చేపట్టాలన్నారు. నిర్దేశించిన సమయానికి కూలీల ంతా పనికి హాజరై కనీస వేతనం వచ్చే విధంగా పని చేయాలన్నారు. పని ప్రదేశంలో వాటర్ అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ ఈశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జనార్దన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎం.అప్పలరాజు మాట్లాడుతూ,జాతీయ రహదారిపై నిరంతరం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రాంతాన్ని ఆక్సిడెంట్ జోన్‌గా ఇప్పటికే ప్రభుత్వం గుర్తించిందన్నారు.ప్రమాదాల కారణంగా గాయపడిన క్షతగాత్రులను నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నారని, సౌకర్యాలు లేని కారణంగా వైద్యులు ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యంకు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి, కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారన్నారు. దీంతో గాయపడిన క్షతగాత్రులు మార్గమధ్యలోనే మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కొత్తగా ఏర్పడిన జిల్లాలలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు నక్కపల్లిలో నెలకొల్పాలని కోరారు.ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భరణికుల రాము, సిఐటియు జిల్లా నాయకులు మామిడి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న అప్పలరాజు

గిరిజన యోధుల కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి-గొలుగొండ:దేశ స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొని ప్రాణాలు కోల్పోయిన గిరిజన స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, ఇంచార్జ్ అధ్యక్షుడు పివి సత్యనారాయణరావు కోరారు. గంటందొరకు నివాళులర్పించిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు రెండేళ్ల సాయుధ పోరాటంలో ఎందరో గిరిజన యోధులు బ్రిటిష్ పాలకులతో పోరాడి ప్రాణ త్యాగం చేశారన్నారు. అల్లూరి అనుచరులను నిర్దిష్టంగా గుర్తించడంలో పాలకులు శ్రద్ధ చూపలేదని పూర్వపు విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లో 1922 నుంచి 24 వరకు జరిగిన సాయుధ పోరాటంలో బ్రిటిష్ పాలకులపై తిరుగుబాటు చేసిన గిరిజన స్వాతంత్ర సమరయోధులను గుర్తించి వారి కుటుంబాలకు తగు జీవనోపాధి, శాశ్వత గృహ వసతి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పడాల డిమాండ్ చేశారు. కృష్ణదేవిపేట అల్లూరి పార్కులో గాం గంటందొర, మల్లు దొర విగ్రహాల ఏర్పాటుకు ప్రభుత్వం తక్షణం తగు చర్యలు తీసుకోవాలని సంఘం ఇంచార్జ్ అధ్యక్షుడు పీవీ సత్యనారాయణ రావు కోరారు. వీరి విగ్రహాల ఏర్పాటుకు తమ సంఘం సిద్ధంగా ఉందని, అధికారిక అనుమతి కోసం ఆరు నెలలుగా అడుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు స్పందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి యువజన సంఘ రాష్ట్ర కార్యదర్శి వరలక్ష్మి పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న సర్పంచ్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని మేజర్ పంచాయతీ తిమ్మాపురంలో మిలీనియం ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం వద్ద మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పచ్చదనంతో కళకళలాడే గ్రామాలను రియల్ ఎస్టేట్ పేరుతో ఎక్కడికక్కడ చెట్లు తొలగించడంతో పరిశుభ్రమైన గాలి లేక కాలుష్యం పెరిగిందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్ తరాలు గాలిని కూడా కొనుక్కోవాల్సిన దుస్థితి వస్తుందన్నారు. పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిదని తెలిపారు.ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపురం ఎంపిటిసి బొండా వెంకటలక్ష్మి దివాణం, పంచాయతీ కార్యదర్శులు రమేష్ బాబు, శ్రీను, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులకు సన్మానం

ప్రజాశక్తి-రోలుగుంటమండలంలో ప్రజలతోనూ, రాజకీయ నాయకులతో తక్కువ సమయంలోనే అవినాభావ సంబంధం ఏర్పడిందని, రీ సర్వేలో రెవెన్యూ సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందించి అనకాపల్లి జిల్లాలోనే మొదటి స్థానం తీసుకు వచ్చారని తహశీల్దార్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. తహశీల్దార్, డిటి త్రివేణి, రీ సర్వే డిటి రాజేంద్ర, ముగ్గురు వీఆర్వోలు, ఒక అటెండర్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం మండల కార్యాలయంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలోమండల తహశీల్దార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఈ మండలంలో 11 నెలలు పని చేశానని, ఒక నెల సెలవుపై ఉన్నానని, 10 నెలల్లో మండల ప్రజలకు, రాజకీయ నాయకులతో మంచి సంబంధాలు ఏర్పడ్డాయన్నారు. బదిలీపై వెళ్లడం కొంత బాధాకరంగా ఉందన్నారు. డిప్యూటీ తహశీల్దార్ హెచ్.త్రివేణి మాట్లాడుతూ, ఈ మండలంలో సర్వేయర్లు బాగా పని చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర మాట్లాడుతూ, తక్కువ సమయంలోనే బదిలీ కావడం బాధగా ఉందన్నారు.

సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

శిథిల భవనాల పరిశీలన

ప్రజాశక్తి నక్కపల్లి:

నక్కపల్లిలో శిథిలావస్థలో ఉన్న భవిత కేంద్రం, మండల విద్యాశాఖ కార్యాలయంను బుధవారం డీఈవో వెంకట లక్ష్మమ్మ పరిశీలించారు. రెండు భవనాల మరమ్మత్తు పనులు చేపట్టేందుకు అంచనా వేసి నివేదిక అందజేయాలని ఎస్ఎస్ ఏఈను ఆదేశించారు. అనంతరం పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాలు ఏపీ రెసిడెన్షియల్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఆమె వెంట ఎంఈఓ డివిడి ప్రసాద్, అధికారులు, తదితరులు ఉన్నారు.

భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఈఓ

మాకిరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: వామపక్ష ఉద్యమ నాయకులు మాకిరెడ్డి ఎర్రి నాయుడు అలియాస్ మాకిరెడ్డికి గబ్బాడలో సిపిఎం సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, కె. సూర్యప్రభ, అడిగర్ల రాజు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులురెడ్డిలు పూల మాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా సాపిరెడ్డి నారాయణమూర్తి మాట్లా డుతూ, 1966 నుండి సిపిఐలోనూ, అనంతరం సిపిఎంలో మాకిరెడ్డి పని చేసారని, చిన్న నాటి నుండి చురుకుగా, రైతు, కార్మిక సమస్యలపై పోరాటం చేశారన్నారు. మాకిరెడ్డి మరణం తీరని లోటన్నారు. ఈ సందర్భంగా కె.త్రిమూర్తులు రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించారని, అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నారని కొనియాడారు.

నివాళి అర్పిస్తున్న నేతలు

మాకిరెడ్డి, కెవిఆర్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ, అనకాపల్లి : రైతు నాయకులు, వామపక్ష ఉద్యమ అభిమాని మాకిరెడ్డి ఎర్రినాయుడు, ఎల్ఐసి ఉద్యోగుల ఉద్యమ నేత కెవి.రమణమూర్తి మృతి పట్ల సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ, అఖిల భారత రైతు, వ్యవసాయ కూలి సంఘం సంతాపం తెలిపాయి. నర్సీపట్నం ప్రాంతంలో వ్యవసాయ కార్మికులు, భూమి లేని నిరుపేదలను మాకిరెడ్డి చైతన్యవంతులు చేసి అనేక పోరాటాలు నిర్వహించి ఫలితాలు సాధించారని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పేర్కొన్నారు. మాకిరెడ్డి మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి, కెవి.రమణమూర్తి అకాల మరణం కార్మికవర్గానికి తీరనిలోటు అన్నారు.

ఊరేగింపునకు అడ్డంకి

ప్రజాశక్తి-మాడుగుల:మోదకొండమ్మ అమ్మవారి పండగ వైభవంగా జరిగినప్పటికీ అర్ధరాత్రి పూరేగింపు విషయం లో వివాదం చెల రేగింది. సుమారు మూడు నెలల కిందట గ్రామానికి చెందిన శ్రీనాథు రామ మూర్తి, రమేష్ కుటుంబంలో జరిగిన వివాహ కార్యక్రమానికి ఇంటి ముందు భారీ పందిరి వేశారు. ఇప్పటి వరకు సదరు పందిరి తొలగించలేదు. అమ్మవారి పండగ పూరేగింపులో పలు బండ్ల వేషాలు ఏర్పాటు చేశారు. సెట్టింగులతో కొంచెం ఎత్తులో వుండగా, సదరు పూరేగింపు పెళ్లి పందిరి వేసిన ఇంటి ముందుకు వచ్చేసరికి పందిరి అడ్డు తగలడంతో పూరేగింపు ఆగిపోయింది. దీంతో బండ్ల వేషాల నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పందిరి తొలగించమని కమిటీ వారు చెప్పినా, సదరు నిర్వాహకులు నిర్లక్ష్యం వహించారు. దీంతో తీవ్ర వాగ్వాదానికి జరిగిన తరువాత బండ్ల వేషాలు ఆ ఇంటి ముందు ఉదయం వరకు ఆగి పోయాయి. అమ్మవారి ఘటాలు ఎలాగోలా గుడికి చేరుకున్నాయి. ఈ విషయం పై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మున్సిపల్ ఎన్నికలపై ఉత్కంఠ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలపై రాజకీయ నేతలు, ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. మునిసిపల్ ఎన్నికలు జరిపేందుకు ఎన్నికల కమిషన్ నుండి ఆదేశాలు రావడంతో మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ఏ విధంగా జరుగుతాయో చూడాలి. మున్సిపల్ చైర్మన్ రాజీనామా వ్యవహారంలో ఆ పార్టీలో కౌన్సిలర్లు మధ్య సఖ్యత లేదన్న విషయం రాజకీయ వర్గాలను విస్మయానికి గురి చేసింది. ముందుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా జరిగిన రాజకీయ ఒప్పందం ప్రకారం రెండేళ్ల కాల పరిమితి మేరకే మాట ఇచ్చినప్పటికీ, చైర్మన్‌తో రాజీనామా చేయించిన విధానం సక్రమంగా లేదని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోనే ఓ వర్గంలో అసంతృప్తి నెలకొంది. రాజీనామా చేసిన మూడు నెలల తర్వాత, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో ఒక్కసారిగా మున్సిపల్ రాజకీయాలు వేడెక్కాయి.

మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డులు ఉన్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 14, తెలుగుదేశం 12, జనసేన ఒకటి, స్వతంత్ర అభ్యర్థి ఒకరు, కౌన్సిలర్ లుగా ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జనసేన, టిడిపి సభ్యులు కలిస్తే 13 మంది సభ్యుల బలం ఉంటుంది. నర్సీపట్నం మున్సిపాలిటీలో చైర్పర్సన్ ఆదిలక్ష్మి, వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తి ముందుగా ఆ పార్టీలో అంతర్గతంగా జరిగిన రాజకీయ ఒప్పందం ప్రకారంగా రెండు సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత రాజీనామా చేశారు. వీరి స్థానంలో 12 వార్డు కౌన్సిలర్ బోడపాటి సుబ్బలక్ష్మి చైర్మన్‌గా, 8వ వార్డు కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ వైస్ చైర్మన్ గాను ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ గతంలోనే ప్రకటించారు. రెండు సంవత్సరములు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పని చేసినప్పటికీ పూర్తి సంతృప్తి చెందలేదని ప్రజలకు సేవలు అందించే సమయంలో రాజీనామా చేయవలసి వస్తుందంటూ పలువురు వద్ద మాజీ చైర్పర్సన్ ఆదిలక్ష్మి బాధపడటం తెలిసిందే. కొంతమంది కౌన్సిలర్‌ల ఒత్తిడి మేరకే ఆమె రాజీనామా చేసినట్లు కూడా తెలుస్తోంది. ఆదిలక్ష్మి రాజీనామా చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొనకపోవడం ఇప్పుడు ఈ ఎన్నిక సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న లుకలుకలు బయట పడుతున్నారు. ఈ నేపథ్యంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో ఏ మేరకు ఈ ప్రభావం చూపిస్తుందోనని పలువురు ఆశక్తిగా ఎదురు చూస్తున్నారు.

టిడిపి, జనసేన కలిస్తే 13 మంది సభ్యుల బలం ఉన్నప్పటికీ, ఎస్సీ కౌన్సిలర్ లేక పోవడంతో చైర్పర్సన్‌కు పోటీ పెట్టకపోవచ్చునని వైసిపి వర్గాలు ధీమాతో ఉన్నాయి. కీలకమైన వైస్ చైర్మన్ పదవి విషయంలో కోనేటి రామకృష్ణ అభ్యర్థిత్వాన్ని వైసీపీలోని ఒక వర్గం వ్యతిరేకిస్తుందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జనసేన కౌన్సిలర్ వైస్ చైర్మన్గా నామినేషన్ వేస్తే, టిడిపి కౌన్సిలర్లతో పాటు, వైసీపీలో కోనేటి రామకృష్ణని వ్యతిరేకించే ఒక వర్గం కౌన్సిలర్లు, మద్దతు తెలియజేస్తారా లేదా వేచి చూడాలి. మరోవైపు ఒకవేళ టీడీపీ వైస్ చైర్మన్ గా పోటీ చేస్తే భవిష్యత్తులో టిడిపిలో చేరాలనుకుంటున్న ఒకరిద్దరు వైసిపి కౌన్సిలర్లు ఉన్నారని, వారు లోపాయి కారిగా మద్దతు ఇచ్చే అవకాశం ఉంది.

మున్సిపల్ కార్యాలయం

దుప్పట్లు పంపిణీ చేస్తున్న వీరభద్రరావు

గంటందొరకు ఘన నివాళి

ప్రజాశక్తి-గొలుగొండ: విప్లవ వీరుడు, అల్లూరి సీతారామరాజుకు ప్రధాన అనుచరుడు, విప్లవ సేనాని గాం గంటం దొర 99వ వర్ధంతి సందర్భంగా బుధవారం మండలంలోని కృష్ణదేవిపేట అల్లూరి స్మారక మందిరంలో ఘనంగా నివాళ్లు అర్పించారు. జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు గంటందొరకు పూలమాల వేశారు. అల్లూరి, గంటందొరల సమాధుల వద్ద జ్యోతి వెలిగించారు. దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులో ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు, అతని ప్రధాన అనుచరుడిగా గాం గంటం దొర సారధ్యంలో అల్లూరి సేన బ్రిటిష్ పాలకులపై చేసిన సాయుధ పోరాటం చరిత్రలో మరపురాని ఘట్టంగా నిలిచిపోతుందని పడాల వీరభద్రరావు అన్నారు. అనంతరం సుమారు 20 మంది మహిళలకు, అల్లూరి పార్కు సంరక్షకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రత్యేకంగా రూపొందించిన గంటందొర చిత్రపటాన్ని సంఘం ఇంచార్జ్ అధ్యక్షుడు పీవీ.సత్యనారాయణరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి శ్యామల వరలక్ష్మి, కార్యవర్గ సభ్యుడు వరహాల బాబు పాల్గొన్నారు.

ఆవలో మట్టి తవ్వకాలను అరికట్టాలి

ప్రజాశక్తి -పాయకరావుపేట: మండలంలోని గుంటపల్లి ఆవలోని అక్రమంగా చేపడుతున్న మట్టి తవ్వకాలను అరికట్టి, మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాయకరావుపేట ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆవ చెరువులో మట్టి తరలింపునకు ఇరిగేషన్ శాఖ ఇచ్చిన ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలన్నారు. గత వారం రోజులుగా జెసిబి లతో తవ్వి పెద్ద పెద్ద టిప్పర్లలో పగలు రాత్రులు అనకుండా మట్టి తరలిస్తున్నారన్నారు. వేరు వేరు ప్రాంతాలలో ప్రైవేట్ రియల్ ఎస్టేట్ ప్లాట్‌లకు మట్టి వేస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములో ఈ విధంగా ప్రైవేటు వ్యక్తులు అనుమతులు పొందిన దానికి విరుద్ధంగా యదేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారన్నారు. పాయకరావుపేట పేటకు చెందిన అధికార పార్టీ నాయకుల అండదండలతో మట్టి మాఫియాకు పాల్పడుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోకపోతే న్యాయ స్థానాలను ఆశ్ర ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బత్తిన నాగేశ్వరరావు, మామిడి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ పనులు వేగవంతం

ప్రజాశక్తి-కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి కుళాయి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న జల్ జీవన్ మిషన్ పనులు వేగ వంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గొల్ల బాబురావు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన పలువురు సర్పంచ్, ఎంపిటీసీ సభ్యుల నుంచి జరుగుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయని రాత్రి సమయంలో కనీసం నడిచి వెళ్లేందుకు సైతం ఇబ్బంది పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా పలువురు గుత్తే దారులు చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, డీఈ ఆనంద్, ఏఈ కరుణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మొక్కుబడిగా గడప గడపకు..

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం మొక్కుబడిగా సాగుతోంది. బుధవారం రామచంద్రపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమం వచ్చామా! వెళ్ళామా? అన్నట్లుగానే సాగింది. గ్రామంలోకి ప్రవేశించడం సంక్షేమ పథకాల కరదీపిక పట్టుకోవడం, ఫోటోలు దిగడం వెళ్ళిపోవడం ఇదే తంతుగా సాగుతోంది. గ్రామంలో పలువురు గ్రామస్తులు కాలనీ ఇల్లు మంజూరు కోసం మొరపెట్టుకున్నారు. రుద్రభూమి నిర్మాణానికి నిధులు కావాలని కోరారు. తాగునీరు, పారిశుధ్యం పట్ల చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దత్తుడు రాజు పాల్గొన్నారు.

రామచంద్రపురం గ్రామంలో గడపగడపకు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శివారు గిరిజన గ్రామమైన అల్లుముయ్యపాలెం గ్రామాన్ని సందర్శించక పోవడం పట్ల పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలో కొడవటిపూడి గ్రామ శివారు గిరిజన గ్రామం కోదండరాంపురం, గుట్టువాడ గ్రామ శివారు గిరిజన గ్రామం అణుకు గ్రామాలను సైతం గడపగడపకు మన ప్రభుత్వంలో సందర్శించక పోవడం పట్ల ఆ గ్రామాలకు చెందిన గిరిజనులు సహా మండలంలో పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

కనిపించని జోష్

గతంలో ఎమ్మెల్యే మండలానికి పర్యటనకై వస్తే మండల స్థాయి నాయకులు నుండి గ్రామ స్థాయి నాయకుల వరకు ఎంతో ఉత్సాహంగా సందడిగా స్వాగతం పలికేవారు. అడుగడుగునా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి స్వాగతం తెలిపేవారు. వార్డు సభ్యులు, బూత్ కమిటీ కన్వీనర్లు ఎంతో ఉత్సాహంగా పాల్గొనేవారు. అటువంటిది ఇప్పుడు గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడం విశేషం.

పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ఏటికొప్పాక మాజీ సుగర్స్ చైర్మన్ మృతి

ప్రజాశక్తి-కోటవురట్ల: ఏటికొప్పాక మాజీ చక్కెర కర్మాగారం చైర్మన్, వైసిపి నాయకులు రాజాసాగి రామభద్రరాజు(చిరంజీవి) అనారోగ్యంతో విశాఖలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు.

ఆయన పలు పర్యాయాలు ఏటికొప్పాక సుగర్స్ చైర్మన్ గా పనిచేశారు. గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. మృతదేహానికి తంగేడు గ్రామంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

రక్తదానం చేస్తున్న పూర్ణచంద్రరావు, శివాజి

'భూమాత' రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : భూమాత గ్రూప్ అధినేత తాళ్లూరి పూర్ణ చంద్రరావు, శివాజీల తల్లి తాళ్లూరి సుబ్బలక్ష్మి ద్వితీయ వర్ధంతి సందర్భంగా భూమాత సంస్థ ఎంవిపి కాలనీ బ్రాంచ్‌లో రోటరీ బ్లడ్ బాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, వారి బంధువులు సుమారు 400 మంది పాల్గొన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యాన భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమవు తున్నామని సంస్థ అధినేత తాళ్లూరి పూర్ణ చంద్రరావు తెలిపారు.

ఆదివాసి సాంస్కృతిక సంబరాల్లో..

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

ప్రజాశక్తి -అరకులోయ /అరకు రూరల్: ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఎనిమిదవ మహాసభల సందర్భంగా గిరిజన సంఘం ఆధ్వర్యంలో 6,7,8 తేదీల్లో ఆట పాట మాట అనే నినాదంతో జరుగుతున్న ఆదివాసి సంస్కతిక సంబరాలు గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతి ప్రతిబంభించాయి. రెండో రోజుకీ కార్యక్రమాన్ని గిరిజన సంఘం జాతీయ కార్య వర్గ సభ్యుడు బి.అప్పలనర్స, రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, సంస్కతిక సంబరాల నిర్వహణ కమిటీ చైర్మన్ చిట్టిబాబు, రఘునాథ్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్, ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు మంగరాజు, కన్వీనర్ జోషి ప్రారంభించారు.

నృత్యం చేస్తున్న గిరిజనులు

మునుపెన్నడూ లేని విధంగా మరుగున పడిపోయిన గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావ్య ప్రపంచానికి తీసుకుని వచ్చి స్వతంత్ర సమర యోధుడు ఆదివాసి పోరాట యోధుడు మరి కామయ్య కళావేదిక వద్ద ప్రదర్శించిన వివిధ కళా ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకుంది. గిరిజన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా వేసిన ప్రదర్శనలు గిరిజన సంస్కృతికి దర్పణం పట్టాయి. మొదటి రోజు ఈ వేదికలో వేసిన 10 రకాల కళారూపాలు అంతరించి పోతున్న గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచి జీవం పోసాయి. రెండవ రోజు అందుకు భిన్నంగా వేసిన కళా ప్రదర్శనలు సంస్కతిక ప్రదర్శనలతో పాటు రాజమండ్రి శ్రీరాములు ప్రదర్శించిన మెజీషియన్స్ అమితంగా ఆకట్టుకుంది. దుమ్మగూడ, చొంపి గ్రామానికి చెందిన గిరిజన సంస్కతిక దింసా నృత్య ప్రదర్శనలు అమితంగా ఆకట్టుకున్నాయి. డుంబ్రిగూడ మండల జాపరవలస సంకటి నృత్యం ముచ్చంగిపొట్టు బ్రాండ్ బాజా, మాడగడ వాయిద్యం, చొంపిబుట్ట దింసా, కిరాయిగూడ అలెక్ భజన, మద్రిగూడ తగిల నాటకం, జాతర వలస బుడియా నాటకం విశేషంగా ఆకట్టుకున్నాయి. గిరిజన సాంస్కృతిక సంబరాల్లో పాల్గొన్న ప్రతి కళా బృందానికి ఆదివాసి సంస్కతిక సంబరాల నిర్వహణ కమిటీ నాయకులు గిరిజన సంఘం నాయకులు వివిధ పాఠశాలల గిరిజన ప్రధానోపాధ్యాయులు మెమొంటోలు సర్టిఫికెట్లు అందజేశారు. ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ సంస్కృతిక ప్రదర్శనలకు సంబంధించి అధ్యక్షతత వహించారు. గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి. అప్పలనరస, రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర, మంతెన సీతారాం, పోతురాజు, కొండలరావు, వివిధ గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల ప్రతినిధులు చిట్టిబాబు, కే.రఘునాథ్, దేముడు, గిరిజనులు వేసిన సంస్కతిక నత్య ప్రదర్శనలను తిలకించారు.

సంబరాల్లో పాల్గొన వివిధ కళాబందానికి ప్రధానో ఉపాధ్యాయులు దయానిది, నారాయణ, మహేష్ నందు, అప్పలనరస, ముఖి సాంబయ్య, కృష్ణకుమారి, విజయ్ కుమార్, రాంబాబు, రెవెన్యూ శాఖ ఎలక్షన్ డ్యూటీ అప్పన్న, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, తదితరులు మెమొంటు సర్టిఫికెట్లు అందజేశారు.

నేడు పెట్రోల్ బంక్ ప్రారంభం

ప్రజాశక్తి -అనంతగిరి: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హెచ్‌పిసిఎల్ పెట్రోల్ బంక్‌ను ఈనెల 8న గురువారం అల్లూరి సీతారామ రాజు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, ఉమ్మడి జిల్లా చైర్ పర్సన్ ల చేతుల మీదుగా ప్రారంభి స్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.